సాక్షి
విశాఖపట్నం

సోమవారం । 5 । ఫిబ్రవరి । 2024


పరుగు తీస్తున్న అక్షర్ పటేల్, గిల్



నగరంలో 'భామాకలాపం'

ప్రియమణి ప్రధాన పాత్రలో నటించిన భామాకలాపం-2 చిత్ర యూనిట్ విశాఖలో సందడి చేసింది. 8లో



ఇండియన్ కోస్ట్‌గార్డ్ రైజింగ్ డే వేడుకలను ఈస్టర్న్ సీబోర్డ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ డోనీ మైఖేల్, టీఎం ఐసీజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈస్టర్న్ నేవల్ కమాండ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, ఏవీఎస్ఎమ్, వీఎస్ఎంలు హాజరయ్యారు. 8లో

గిల్.. థ్రిల్


స్టేడియంలో అభిమానుల కోలాహలం



కోహ్లి అభిమాని సందడి

ఫామ్‌లో లేడన్నారు..విమర్శలు ఎదుర్కొన్నాడు..ట్రాక్ తప్పాడన్నారు..వీటిన్నింటికీ తన బ్యాట్‌తోనే సమాధానం చెప్పాడు సెన్సేషనల్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్. వైఎస్సార్ స్టేడియంలో సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. క్రికెట్ అభిమానులకు థ్రిల్ కలిగించాడు. ఎంతో బాధ్యతాయుతంగా ఆడి జట్టుకు భారీ స్కోర్ సాధించిపెట్టాడు. తన తండ్రి కళ్లముందే ఈ సెంచరీ నమోదు చేయడం వెరీవెరీ స్పెషల్.. ఈ మధురానుభూతిని గిల్ తన మదిలో దాచుకున్నాడు. అభిమానులు కేరింతలకు స్టేడియం మార్మోగింది. క్రికెట్‌ను ఆస్వాదిస్తూ అభిమానులు సందడి చేశారు. 8లో

న్యూస్‌రీల్

ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా'


పోటీలపై చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో ఎటువంటి లోటుపాట్లకు తావివ్వకూడదని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్, వర్చువల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా ముగింపు కార్యక్రమంలో ఎటువంటి లోపాలకు తావివ్వొద్దని, ముఖ్యంగా ప్లే గ్రౌండ్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమీక్షా సమావేశంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీర్ రవి కృష్ణంరాజు ఇతర ఉన్నతాధికారులతో పాటు వర్చువల్ సమీక్షలో ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ పాపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న సంజయ్‌కుమార్


సంజయ్ కుమార్‌కు అప్పన్న జ్ఞాపికను అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని ఆదివారం ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

ఇంటర్ ఫీజుకు తత్కాల్ అవకాశం

విశాఖ విద్య: ఇంటర్ పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు తత్కాల్ అవకాశం కల్పించినట్లు ఆర్ఐవో పి. మురళీధర్, డీవీఈవో బి.రాధ తెలిపారు. మార్చి నెలలో జరిగే పరీక్షలకు తత్కాల్ పద్ధతిన రూ.3 వేలు ఫీజు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5గంటల వరకు చెల్లించవచ్చన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఇంటర్ చదువుతూ, ఫీజు సకాలంలో చెల్లించలేని వారికి ఇదో గొప్ప అవకాశం అన్నారు. అదే విధంగా గతంలో తప్పిన విద్యార్థులు కూడా తత్కాల్ ద్వారా ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలు


అగనంపూడి వాలీబాల్ విజేతకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

విశాఖ స్పోర్ట్స్ : ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్ జిల్లా స్థాయి పోటీలు ఆదివారంతో ముగిశాయి. జనవరి 31వ తేదీనుంచి ఐదు క్రీడాంశాల్లో మెన్, వుమెన్‌కు ఈ పోటీలు క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ఆదివారం ఏయూ గ్రౌండ్స్‌లో ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లతో పాటు నగదు ప్రోత్సాహకాలను అందించారు. నియోజకవర్గ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు జిల్లా స్థాయి పోటీల్లో తలపడ్డాయని డీఎస్‌డీవో జాన్ గాలియట్ తెలిపారు. తూర్పు నియోజకవర్గానికి చెందిన నాలుగు జట్లు విజేతలుగా నిలవగా పశ్చిమ, గాజువాక నియోజకవర్గానికి చెందిన రెండేసి జట్లు, భీమిలి, పెందుర్తి నియోజకవర్గాలకు చెందిన ఒకో జట్టు విజేతగా నిలిచాయి. మెన్ విభాగపు క్రికెట్ పోటీల్లో నక్కవానిపాలెం జట్టు, బ్యాడ్మింటన్‌లో సుసర్ల కాలనీ1 జట్టు, వాలీబాల్‌లో ప్రశాంతినగర్ జట్టు, కబడ్డీలో ఓల్డ్ అయ్యన పాలెం జట్టు , ఖోఖోలో సాకేత్‌పురం1 జట్టు విజేతగా నిలిచింది. మహిళా క్రికెట్‌లో వాంబే కాలనీ 6 జట్టు, బ్యాడ్మింటన్‌లో పెదవాల్తేర్ 2 జట్టు, వాలీబాల్‌లో రజకవీధి1 జట్టు, కబడ్డీలో లాసన్స్‌బే కాలనీ జట్టు, ఖోఖోలో లంకెలపాలెం జట్టు విజేతగా నిలిచాయి.

ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు
- హాజరుకానున్న 1,112 మంది విద్యార్థులు
- జిల్లాలో 9 కేంద్రాలు ఏర్పాటు
- జంబ్లింగ్ విధానంలో ఎగ్జామినర్లు
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు


కృష్ణా కాలేజీలో ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థినులు (ఫైల్)

విశాఖ విద్య: జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రోజూ ఉదయం 9గంటల నుంచి 12 వరకు అదే విధంగా మధ్యాహ్నం 2గంటల నుంచి 5 వరకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఒకేషనల్ కోర్సులు చదువుతున్న మొదటి సంవత్సరం 595, రెండో సంవత్సరం 517 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రాక్టికల్స్ నిర్వహణ కోసం జిల్లాలో ఒక ప్రభుత్వ, 8 ప్రైవేటు కాలేజీల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 11 నుంచి ప్రారంభమయ్యే జనరల్ కోర్సు ప్రాక్టికల్స్ పరీక్షలకు 41,193 మంది విద్యార్థులు హాజరౌతున్నందున 150 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి. మురళీధర్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. కేంద్రాల్లో విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించారు.

సీసీ కెమెరాలతో నిఘా

విద్యార్థులు చదువుకున్న కాలేజీలోనే ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తున్నందున ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించేలా పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని అన్ని కాలేజీల్లో అవసరమైన సీసీ కెమెరాలను అమర్చారు. వీటిని కేంద్రం చీఫ్ సూపరింటిండెంట్ గదికి అనుసంధానం చేసి, పరీక్ష జరుగుతున్నంత సేపు పర్యవేక్షణ చేసేలా ఉన్నతాధికారులు ఆదేశించారు. అంతేకాకుండా పరీక్ష కేంద్రాల్లో ఏం జరుగుతందనేది ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనరేట్ నుంచి కూడా చూసేలా సాంకేతికతను వినియోగించి లైవ్ కొనసాగేలా ఏర్పాట్లు చేశారు.

జంబ్లింగ్ విధానంలో ఎగ్జామినర్లు

పరీక్షలకు సంబంధించిన సామగ్రి, నామినల్ రోల్స్, ఇన్విజిలేటర్ల జాబితా వంటి వాటిని ఇప్పటికే కాలేజీలకు పంపించారు. నాన్ జంబ్లింగ్ విధానం అమలు చేస్తున్నప్పటికీ, ఎగ్జామినర్లను మాత్రం ఇతర కాలేజీల నుంచి విధులకు కేటాయిస్తున్నారు. సోమవారం నుంచి ప్రారంభయ్యే ప్రాక్టికల్ పరీక్షలకు జిల్లాలోని 9 కేంద్రాలకు 28 మంది ఎగ్జామినర్లను నియమించారు. ప్రాక్టికల్ పరీక్ష ముగిసిన గంటలోపు తప్పనిసరిగా విద్యార్థులు సాధించిన మార్కులను ఆన్‌లైన్‌లో పొందుపరుచాలనే నిబంధన విధించారు. దీని వల్ల అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని బోర్డుఅధికారులు భావిస్తున్నారు.

కార్పొరేట్‌కు అడ్డుకట్ట పడాల్సిందే..

సెల్ఫ్ సెంటర్లలో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నదున ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. తమ విద్యార్థులకు ఎక్కువ మార్కులు వేయించుకునేలా జిల్లాలోని కొన్ని కార్పొరేట్ కాలేజీల్లో ఎగ్జామినర్లను ప్రలోభాలకు గురిచేస్తూ, మాస్‌కాపీయింగ్‌కు లాబీయింగ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించకపోతే ప్రభుత్వ కాలేజీల్లో చదివే విద్యార్థులు నష్టపోతారని ప్రభుత్వ కాలేజీల అధ్యాపకులు అంటున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాం. కేంద్రాలుగా ఎంపిక చేసిన 15 కాలేజీలకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశాం. కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించేలా ఆదేశాలు ఇచ్చాం. ఎగ్జామినర్ డ్యూటీ వేసే వారి జాబితా అంతా ఇంటర్మీడియెట్ బోర్డు నుంచే వస్తుంది. పరీక్షలను నిర్వహణలో ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే, కఠిన చర్యలు తీసుకుంటాం.

– పి. మురళీధర్, ఆర్ఐవో

పీఏసీఎస్ చైర్మన్ల పదవీ కాలం పొడిగింపు

కొన్ని చోట్ల మార్పులు చేర్పులు


విశాఖలోని డీసీసీబీ కార్యాలయం

విశాఖ విద్య: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్/ఎఫ్ఎస్‌సీఎస్/ ఎల్ఎస్‌సీఎస్) పదవీ కాలం పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కార్యకలాపాలను కొనసాగించాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులకు సమాచారం అందింది. డీసీసీబీ పరిధిలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 98 పీఏఎస్‌సీలకు ఇప్పటి వరకు పనిచేస్తున్న పాలక మండళ్ల ఈ ఏడాది జులై 30 వరకు లేదా వీటికి ఎన్నికలు నిర్వహించేంత వరకు యథావిధిగా కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే కొన్ని చోట్ల నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా చైర్‌పర్సన్, సభ్యులను మార్పు చేశారు. ఇలా అనకాపల్లి జిల్లా శ్రీ గౌరి సొసైటీ, మేడివాడ, అదేవిధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో అనంతగిరి, పాడేరు. జి. మాడుగుల, చింతపల్లి, జి.కే.వీధి సొసైటీ పాలక మండళ్లలో చేర్పులు, మార్పులు చేశారు. అనకాపల్లి జిల్లా తుమ్మపాల సొసైటీకి మాత్రం ముగ్గురు సభ్యులుగా బదులుగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ వీవీవీ సత్యకుమార్‌ను పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు,ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని డీసీసీబీ సీఈవో డి.వి.ఎస్. వర్మ తెలిపారు.

గిరిజనుల అభ్యున్నతికి విశేష కృషి


పుస్తకావిష్కరణ చేస్తున్న అఖిల భారత వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ ప్రతినిధి పి.సోమయాజులు, ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వీసీ కట్టమణి, రాజమాత మాయాంక్ కుమారిదేవ్

- ఆదివాసీలది వనవాసీ సంస్కృతి
- కేంద్ర మంత్రి అర్జున్ ముండా
- ముగిసిన గిరిజన సాంస్కృతిక యాత్ర

బీచ్ రోడ్డు: గిరిజనుల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా తెలిపారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తూర్పు కనుమలలో గిరిజన సాంస్కృతిక యాత్ర ముగింపు సభను బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

వర్చువల్ విధానంలో పాల్గొన్న కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఆదివాసీలది వనవాసీ సంస్కృతి అని, ఇటువంటి యాత్రల ద్వారా అది నేటి తరానికి తెలుస్తుందన్నారు. గిరిజనులు తమ తెగ కట్టుబాట్లకు అధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు.

ప్రకృతి ఆరాధకులు

అఖిల భారత వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ మార్గనిర్దేశకుడు పి.సోమయాజులు మాట్లాడుతూ గిరిజనులు ప్రకృతి ఆరాధకులు, పర్యావరణ పరిరక్షకులన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వీసీ కట్టమణి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వివిధ భాషల కారణంగా చదవుకు దూరం అవుతున్నారన్నారు. విద్యతోనే దేశ ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం అవుతారన్నారు. జనవరి 25న జైపూర్‌లో ప్రారంభమైన తూర్పు కనుమలలో గిరిజన సంస్కృతిక యాత్ర 20 ప్రాంతాల్లో సభలను నిర్వహించి ఈ నెల 4న విశాఖకు చేరుకుంది. ఈ సందర్భంగా తూర్పు కనుమలలో గిరిజన సంస్కృతిపై రచించిన పుస్తకాన్ని, జైపూర్ రాజమాత మాయాంక్ కుమారి దేవ్, ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ అధ్యక్షుడు గోపీనాథ్, ఎంపీ జీవీఎల్ నర్సింహారావు, నాగు, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుల కోసం ముమ్మర గాలింపు

- తహసీల్దార్ హత్య కేసులో ఇద్దరిని విచారించిన పోలీసులు
- బెంగళూరుకు రెండు బృందాలు

పీఎంపాలెం: నగరంలో సంచలనం సృష్టించిన తహసీల్దార్ రమణయ్య హత్యకేసు నిందితుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. హత్య చేసిన తరువాత నిందితుడి విమానంలో బెంగళూరు వెళ్లినట్టు నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో రెండు పోలీసు బృందాలను అక్కడకు పంపినట్టు తెలిసింది. హత్యా సంఘటనలో ప్రమేయం ఉన్నట్టు భావిస్తున్న మధురవాడ ప్రాంతానికి చెందిన ఇద్దరు అర్చకులను ఇప్పటికే పోలీసులు విచారించారు.

హత్యకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు మరింత వేగవంతం చేశారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, ఇప్పటికే నిందితుల కోసం పది పోలీసు బృందాలు గాలిస్తున్నట్టు సీఐ రామకృష్ణ తెలిపారు.

నేడు జీవీఎంసీలో 'జగనన్నకు చెబుదాం'

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జగనన్నకు చెబుదాం (గ్రీవెన్స్)కార్యక్రమం నిర్వహించనున్నారు. పారిశుధ్యం, పట్టణ ప్రణాళికా విభాగం, మొక్కల విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజినీరింగ్ తదితర విభాగాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు నేరుగా తెలపవచ్చు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు.

వారణాసి రైలుకు మరో కోచ్

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ-బనారస్-విశాఖ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలుకు శాశ్వత ప్రాతిపదికన ఒక ఏసీ పాంట్రీకార్, ఒక ఫస్ట్ ఏసీ కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ-బనారస్(18311) వీక్లీ స్పెషల్‌కు ఈ నెల 14వ తేదీ నుంచి తిరుగు ప్రయాణంలో బయల్దేరే బనారస్ - విశాఖ (18312) వీక్లీ స్పెషల్‌కు ఈ నెల 15వ తేదీ నుంచి ఒక ఏసీ పాంట్రీకార్, ఒక ఫస్ట్ ఏసీ కోచ్‌లను శాశ్వత ప్రాతిపదికన జతచేస్తున్నారు.

క్యాన్సర్‌పై పోరాటానికి సమష్టి కృషి


క్యాన్సర్‌పై వాక్‌థాన్

బీచ్‌రోడ్డు: క్యాన్సర్‌పై పోరాటానికి సమష్టి కృషి అవసరమని మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సాగరతీరంలో అవగాహన వాక్‌థాన్‌ను ఆదివారం నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ సాగిన ఈ వాక్‌థాన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన పెంచడం ద్వారా ముందస్తుగా గుర్తించడానికి వ్యాధి నివారణకు ఉపయోగపడుతుందన్నారు. వాక్‌థాన్‌లో వివిధ కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు


గెలుపొందిన కర్నూల్ బాలురు, బాలికల జట్లకు కప్‌లు అందిస్తున్న ఏసీపీ జాన్ మనోహర్

భీమునిపట్నం: భీమిలి వుడా మైదానంలో మూడు రోజుల పాటు జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలోను సన్‌స్కూల్ సహకారంతో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఇందులో 13 జిల్లాల నుంచి 26 జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో కర్నూల్, నెల్లూరు జట్లు ఫైనల్‌లో తలపడగా కర్నూల్ జట్టు గెలుపొందింది. నెల్లూరు జట్టు రన్నర్‌గా నిలవగా, ప్రకాశం జట్టు మూడో స్థానంలో నిలిచింది. అలాగే బాలికల విభాగంలో కర్నూల్, ప్రకాశం జట్లు తలపడగా అందులో కర్నూల్ జట్టు విన్నర్‌గాను, ప్రకాశం జట్టు రన్నర్‌గా నిలవగా, అనంతపూర్ జట్టు మూడో స్థానంలో నిలిచింది. ముగింపు కార్యక్రమానికి అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఎం.జాన్ మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొని గెలుపొందిన జట్లకు కప్‌లు, మెడల్స్ అందించారు. రాష్ట్ర రగ్బీ సంఘ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రగ్బీ ఫెడరేషన్ అబ్‌జర్వర్ నోయల్ మాథ్యూ శ్యాం, జిల్లా రగ్బీ సంఘ అధ్యక్షుడు లలితకుమార్, సన్‌స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.







ప్రేక్షకుల కోలాహలం

పోటెత్తిన ఫ్యాన్స్


విజయం మనదే..


బాల్ రిట్రైవర్లుగా జోన్, జోనల్ జట్ల అమ్మాయిలు, అబ్బాయిలు



విశాఖ స్పోర్ట్స్: మ్యాచ్ ఫార్మాట్ ఏదైనా విశాఖలో జరిగితే.. అది సూపర్‌హిట్టే.! అభిమానుల నుంచి ఆ స్థాయి ఆదరణ ఉంటుంది. భారత్, ఇంగ్లండ్ రెండో మ్యాచ్‌లో భాగంగా ఆదివారం స్టేడియంకు పోటెత్తిన అభిమానులను చూసి బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ సైతం ఆశ్చర్యపోయారు. టెస్టులకు మళ్లీ పూర్వ వైభవం వస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. భారత ఆటగాళ్లు రాణిస్తుండటం.. పైగా ఆదివారం కావడంతో స్టేడియంలోని ప్రతి స్టాండ్ నిండిపోయింది. త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. జయహో భారత్ నినాదాలతో మార్మోగింది. వన్డేలను కాదని టీ–20లకు ఆదరణ పెరిగిన ఈ తరుణంలో.. ఐదు రోజుల పాటు సాగి.. ఒక్కో సారి ఎటువంటి ఫలితం తేలని టెస్టుల పట్ల ఆసక్తి తగ్గిపోతుంది. ఈ పరిస్థితుల్లో విశాఖ వేదికగా జరుగుతున్న భారత–ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఏకంగా 15 వేల మంది టికెట్లను కొనుగోలు చేసి మరీ వీక్షిస్తున్నారు. ఏసీఏ కేవలం రెండు వేల మంది విద్యార్థులను మాత్రమే స్టేడియంలోకి అనుమతిస్తామని చెప్పినా... విద్యార్థుల తాకిడి పెరగడంతో వారిని నిరాశ పరచకుండా ఆదివారం దాదాపు 7 వేల మందికి ప్రవేశం కల్పించింది. వీరంతా స్టేడియంలోని బీ, సీ, కే స్టాండ్స్‌లో కూర్చొని కేరింతలు కొట్టారు. ఔత్సాహిక క్రికెటర్లను దక్షిణ లోయర్ టైర్ సీ స్టాండ్‌లోకి అనుమతించారు. బాల్ రిట్రైవర్లుగా జోన్ జట్లకు ఆడే ఆటగాళ్లను అనుమతించడం పరిపాటి. అయితే ఆదివారం జరిగిన ఇన్నింగ్స్‌లో జోన్, జోనల్ స్థాయికి ఆడుతున్న అమ్మాయిలను బాల్ రిట్రైవర్లుగా.. ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో అనుమతించారు. ఇది మ్యాచ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


విద్యార్థుల కేరింతలు


భరతను అభినందిస్తున్న కెప్టెన్ రోహిత్



పోరాటం


ఉద్వేగం

టెస్ట్ మ్యాచ్‌కు విశేష ఆదరణ



విశాఖ స్పోర్ట్స్: విశాఖలో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌కు హాజరైన అభిమానులను చూసి బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ సంతోషం వ్యక్తం చేశారు. వన్డే, టీ–20లను తలపించే విధంగా హాజరయ్యారని, మళ్లీ టెస్టులకు పూర్వ వైభవం రానుందన్నారు. ఈ టెస్ట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఆదివారం ఆయన విశాఖ వచ్చారు. వైఎస్సార్ స్టేడియంలో బీసీసీఐ జెండాను రోజర్ బిన్నీ, ఏసీఏ జెండాను అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరినాథ్, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు జితేంద్రనాథ్, సీఈవో ఎంవీ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కె.ఎ.పాల్ సందడి


త్రివర్ణ రెపరెపలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం : భీమా వైద్య సేవల శాఖ, కార్మిక రాజ్య భీమా ఆసుపత్రి : విశాఖపట్నం

ఆర్.సి. నంబర్ 2243651/లోకల్ పర్చేస్/ఇ.ఎస్.ఐ.హెచ్./వి.ఎస్.కె.పి./2024, తేది: 02/02/2024

టెండరు నోటీసు

ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఉత్తర్వులు (జి.ఓ.ఎం.ఎస్.నెం. 14 ఎల్.ఇ.టి. & ఐ.ఎం.ఎస్. & ఎఫ్.ఎ.సి. డిపార్టుమెంటు) ప్రకారము కార్మిక రాజ్య భీమా (ఇ.ఎస్.ఐ.) ఆసుపత్రి, విశాఖపట్నంలో అడ్మిట్ అయ్యి చికిత్స పొందుతున్న రోగులకు అత్యవసరముగా అందించు మందులు (Drugs & Medicines) మరియు శస్త్రచికిత్సా వస్తువులు (Surgical Items), స్థానికముగా మందులు సరఫరా చేయు ఫార్మసీ కంపెనీ నుండి రెండు (02) సంవత్సరాలు కాలపరిమితి కొరకు సీలు టెండర్లు కోరడమైనది.
- ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 10 రోజులలో కొటేషన్లను "గౌరవనీయులైన మెడికల్ సూపరింటెండెంట్, ఇ.ఎస్.ఐ. హాస్పిటల్, విశాఖపట్నం" నందు సమర్పించవలెను.
- అనివార్య కారణముల వలన టెండర్లు పాక్షికంగాను లేదా పూర్తిగా రద్దుచేయు అధికారము ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ లోకల్ పర్చేస్ మేనేజ్‌మెంట్ కమిటీ వారికి కలదని తెలియజేయడమైనది.

సం/- B.V. Ramana Murthy, ఛైర్మన్ మరియు మెడికల్ సూపరింటెండెంట్
లోకల్ పర్చేస్ మేనేజ్‌మెంట్ కమిటీ, ఇ.ఎస్.ఐ. ఆసుపత్రి, విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం : భీమా వైద్య సేవల శాఖ, కార్మిక రాజ్య భీమా ఆసుపత్రి : విశాఖపట్నం

ఆర్.సి. నంబర్ 2243651/డైట్/ఇ.ఎస్.ఐ.హెచ్./వి.ఎస్.కె.పి./2023, తేది: 02/02/2024

టెండరు నోటీసు

ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఉత్తర్వులు (జి.ఓ.ఆర్.టి.నెం. 133 ఎల్.ఇ.టి. & ఐ.ఎం.ఎస్. డిపార్టుమెంటు) ప్రకారము ఇ.ఎస్.ఐ. ఆసుపత్రి, విశాఖపట్నంలో ఉండే రోగులకు డైట్ చార్జీలు రూ. 40.00/- నుండి రూ. 80.00/- మరియు డ్యూటీ డాక్టరుకు రూ. 80.00/- నుండి రూ. 100.00/-లకు పెంచినందున ఇ.ఎస్.ఐ. ఆసుపత్రి, విశాఖపట్నంలో ఉండే రోగులకు (In-Patients) వారి అటెండర్లకు మరియు డ్యూటీ డాక్టర్లకు టిఫిను మరియు భోజనము సరఫరా చేయుటకు ప్రావీణ్యముగల కాంట్రాక్టర్లు/ సరఫరాదారుల నుండి రెండు (02) సంవత్సరాల కాల పరిమితి కొరకు సీలు టెండర్లు కోరడమైనది.
- టెండరు ఫారములు ఇ.ఎస్.ఐ. ఆసుపత్రి, విశాఖపట్నం నందు గల కార్యాలయములో ఈ ప్రకటన వెలువడిన తేది నుండి పొందవచ్చును. టెండరు ఫారము మరియు జి.ఎస్.టి. (18%)తో కలిపి రూ. 4,000/-కి డ్రాఫ్టును ఏదైనా జాతీయ బ్యాంకు నుండి "The Lay Secretary and Treasurer Gr. II, ESI Hospital, Visakhapatnam" పేరుమీద మరియు విశాఖపట్నం నందు చెల్లుబాటు అగునట్లు తీసుకుని ఇ.ఎస్.ఐ. ఆసుపత్రి, విశాఖపట్నం నందు గల కార్యాలయములో ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 10 రోజులలో సమర్పించవలెను.
- అనివార్య కారణముల వలన టెండర్లు పాక్షికంగాను లేదా పూర్తిగా రద్దుచేయు అధికారము ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డైట్ మేనేజ్‌మెంట్ కమిటీ వారికి కలదని తెలియజేయడమైనది.

సం/- B.V. Ramana Murthy, ఛైర్మన్ మరియు మెడికల్ సూపరింటెండెంట్
డైట్ మేనేజ్‌మెంట్ కమిటీ, ఇ.ఎస్.ఐ. ఆసుపత్రి, విశాఖపట్నం

తహసీల్దార్ కుటుంబానికి అండగా ఉంటాం

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి



మధురవాడ: కొమ్మాదిలో శుక్రవారం రాత్రి హత్యకు గురైన తహసీల్దార్ రమణయ్య కుటుంబానికి అండగా ఉంటామని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్‌ను హత్యచేసిన నిందితులను అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షిస్తామన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరుగుతుందన్నారు. రమణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నాన్నకు ప్రేమతో..



విశాఖ స్పోర్ట్స్: నాన్న అను రెండు అక్షరాలు మరుపురాని మధుర క్షణాలు. ప్రతి ఒక్కరికి మొదటి హీరో తండ్రే. ఆ తండ్రి ముందు ఏదైనా విషయం సాధిస్తే.. అతని ఆనందానికి అవధులు ఉండవు. ఇలాంటి దృశ్యమే ఆవిష్కృతమైంది వైఎస్సార్ స్టేడియంలో.. టెస్టులో ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న శుభ్‌మన్ గిల్ ఆదివారం వైఎస్సార్ స్టేడియంలో చెలరేగిపోయాడు. మూడో టెస్టుకు జట్టులో ఉంటాడా లేదా అనే సంశయం నెలకొనగా.. రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా సెంచరీ చేశాడు. మూడో రోజు ఆటలో తనకంటే ముందు ఓపెనర్లు ఇద్దరూ కేవలం రెండు పరుగుల వ్యవధిలోనే పెవిలియన్‌కు చేరగా.. ఆ స్థానంలో వచ్చిన గిల్ ఆచితూచి ఆడాడు. రెండు భారీ భాగస్వామ్యాలతో నిలకడగా రాణించి సెంచరీని నమోదు చేశాడు. గిల్ తండ్రి లఖ్వీందర్ సింగ్ స్టేడియంలో కూర్చొని కుమారుడి ఆటను పూర్తిగా ఆస్వాదించగా.. సెంచరీ పూర్తి చేసినప్పుడు తండ్రి వైపు చూసి గిల్ అభివాదం చేశాడు. ఇదే విషయాన్ని వ్యాఖ్యాత రవిశాస్త్రి ప్రశ్నించగా గిల్ ఆనందాన్ని వ్యక్తం చేశాడు.

అప్పన్న సన్నిధిలో క్రికెటర్ వాషింగ్టన్ సుందర్



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని ఆదివారం భారత క్రికెటర్ వాషింగ్టన్ సుందర్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు చేశారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, శేష వస్త్రాన్ని సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు అందజేశారు.

విద్యార్థుల అభ్యున్నతే అందరి లక్ష్యం

విశాఖ విద్య: సేవా భావంతో విధులు నిర్వర్తించి.. విద్యార్థుల అభివృద్ధికి ప్రతీ ఒక్క అధ్యాపకుడు పాటుపడాలని విశ్రాంత ఆర్ఐవో రాయల సత్యనారాయణ అన్నారు. ఇటీవల ఆర్ఐవోగా ఉద్యోగ విరమణ చేసిన రాయల సత్యనారాయణకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి ఆర్ఐవోలు, డీవీఈవోలు, ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు వేడుకలో పాల్గొన్నారు. ఆర్ఐవోగా సత్యనారాయణ అందించిన సేవలను కొనియాడారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ వివిధ హోదాల్లో 36 ఏళ్ల పాటు విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా విధులు నిర్వహించినట్లు చెప్పారు. పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్ఐవోలు పి.మురళీధర్, ఆదినారాయణ, విశాఖపట్నం డీవీఈవో బి.రాధ, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావు, డీఈ నర్సింగరావు, సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా కన్వీనర్ రూపవతి పాల్గొన్నారు.


సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న ఆర్ఐవో మురళీధర్, డీవీఈవో రాధ

విద్యార్థి బలవన్మరణం

అమ్మాయి ప్రేమించలేదనే కారణంతోనే..?


ప్రదీప్ మృతదేహం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 11వ వార్డు పరిధి పార్వతీనగర్‌కు చెందిన సామిరెడ్డి ప్రదీప్(17) వి.ఎస్.కృష్ణా కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తల్లి లక్ష్మి, చెల్లి సౌమ్య, అమ్మమ్మతో కలసి ఉంటున్నాడు. తల్లి హెల్త్‌సిటీలోని ఓ మెడికల్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం 5 గంటలకు ప్రదీప్ ట్యూషన్‌కు వెళ్లాడు. తల్లి ఉదయం 6 గంటలకు విధులకు హాజరైంది. ట్యూషన్ నుంచి తిరిగి ఉదయం 10.30 గంటలకు ఇంటికి చేరుకున్న ప్రదీప్ ఓ గదిలోకి వెళ్లి తలుపులు గడియపెట్టాడు. వెంటిలేటర్ గజాలకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత సమయం తర్వాత అనుమానం వచ్చి అతని చెల్లి, అమ్మమ్మ గది తలుపులు తట్టారు. లోపల గడియపెట్టి ఉండటంతో స్థానికుల సహాయంతో పక్కన కిటికీ తలుపులు తెరిచి చూసే సరికి వెంటిలేటర్‌కు వేలాడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే తల్లి లక్ష్మి ఇంటికి చేరుకుంది. అప్పటికే కొన ఊపిరితో ఉన్న ప్రదీప్‌ను విమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు జరిపి మార్గమధ్యలో ప్రాణాలు విడిచినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఆరిలోవ సీఐ జి.గోవిందరావు, ఎస్ఐ వై.కృష్ణ సిబ్బందితో విమ్స్‌కు వెళ్లి ప్రదీప్ మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పార్వతీనగర్‌లోని ఓ అమ్మాయిని ప్రదీప్ ప్రేమించాడు. కానీ ఆ అమ్మాయి ప్రదీప్‌ను ప్రేమించడం లేదని స్నేహితుల ద్వారా తెలుసుకున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయినట్లు తెలిసింది. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖలో 'భామా కలాపం-2' సందడి

దాబాగార్డెన్స్: విశాఖ నగరంలో భామా కలాపం–2 చిత్ర బృందం ఆదివారం సందడి చేసింది. హీరోయిన్ ప్రియమణి ప్రధాన పాత్ర పోషించిన 'భామాకలాపం' రెండేళ్ల కిందట వచ్చి, మంచి ఆదరణ పొందింది. ఓటీటీలో స్ట్రీమింగ్ అయిన ఆ చిత్రం విజయం సాధించగా.. ఇప్పుడు భామాకలాపం –2 సీక్వెల్ విడుదలకు సిద్ధమైంది. ఈ నెల 16 నుంచి ఓటీటీలో అలరించనుందని చిత్ర బృందం తెలిపింది. మూవీ ప్రమోషన్లో భాగంగా చిత్ర యూనిట్ విశాఖ వచ్చింది. ఈ సందర్భంగా చిత్రంలో ప్రధాన పాత్రల్లో నటించిన శరణ్య, శీరత్ కపూర్ మాట్లాడుతూ భామాకలాపం సీజన్–1 లాగే, సీజన్–2 కూడా ప్రేక్షకులను అలరిస్తుందని చెప్పారు. చిత్రానికి అభిమన్యు దర్శకత్వం వహించారని, బాపినీడు, సుధీర్ నిర్మించగా, ప్రశాంత్ ఆర్.విహారీ సంగీతం అందించారన్నారు.

వచ్చే ఎన్నికల్లో బ్రాహ్మణులకు టికెట్ ఇవ్వాలి

విప్రోత్సవ కమిటీ కన్వీనర్ నారాయణ


ర్యాలీ నిర్వహిస్తున్న బ్రాహ్మణులు

మహారాణిపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బ్రాహ్మణులకు టికెట్ ఇవ్వని రాజకీయ పార్టీలను ఓడించాలని బ్రాహ్మణ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం విప్రోత్సవం సభ జరిగింది. ఈ సందర్భంగా సిరిపురం ద్రోణంరాజు కూడలి నుంచి శోభాయాత్రగా పి.వి.నరసింహారావు కూడలి వరకు వెళ్లి ఆయనకు నివాళి అర్పించారు. అనంతరం భారీ ర్యాలీగా సభ వేదిక గురజాడ కళాక్షేత్రంకు చేరుకున్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన విప్రోత్సవ కమిటీ కన్వీనర్ పి.వి.నారాయణ మాట్లాడుతూ విశాఖ జనాభాలో 10 శాతం మంది బ్రాహ్మణులు ఉన్నారని తెలిపారు. నగరంలో విస్తరించి ఉన్న బ్రాహ్మణులకు రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇచ్చి తీరాలని స్పష్టం చేశారు. ఎంపీ జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ బల ప్రదర్శన చేయనిదే ఎవ్వరూ గుర్తింపు ఇవ్వరన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ మాట్లాడుతూ గతంలో జాతీయస్థాయిలో ఉన్నత హోదాల్లో ఎందరో బ్రాహ్మణులు ఉన్నారని.. నేడు ఆ సంఖ్య తక్కువగా ఉందన్నారు. రానున్న కాలంలో రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి అడుగులు వేద్దామన్నారు. బీజేపీ మహిళా ప్రతినిధి సుహాసిని ఆనంద్, కార్యనిర్వాహక ఛైర్మన్ కావూరి చరణ్ కుమార్, సంస్కృత, ఆంధ్ర పండితులు వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి, విశ్రాంత ఐఏఎస్ అధికారిణి వైవీ అనురాధ, కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, ప్రముఖ న్యాయవాది కె.వి. రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో అధ్యాపకుడి ఆత్మహత్య


రవికుమార్(ఫైల్)

సీతమ్మధార: మనస్తాపంతో ఓ అధ్యాపకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి దొండపర్తిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. దొండపర్తిలోని వెంకటాద్రినగర్‌లో పి.ఎం.నాయుడు రెసిడెన్సీలో గంట్ల రవికుమార్(45).. భార్య పావని, కుమారుడు సాయి విశాల్ కలసి నివాసం ఉంటున్నారు. రవికుమార్ ప్రైడా కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. అతని భార్య ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. పావని చీటి డబ్బులు కట్టలేక మనస్తాపంతో శనివారం ఉదయం సిట్రజన్ మాత్రలు వేసుకుని సబ్బవరం వైపు వెళ్లింది. సబ్బవరం వద్ద కుప్పకూలిపోయింది. ఇది గమనించిన స్థానికులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు రవికుమార్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. వెంటనే అక్కడకు చేరుకుని రవికుమార్ ఆమెను నగరంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రాత్రి ఇంటికి వచ్చిన రవికుమార్.. మనస్తాపంతో బెడ్ షీట్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో కుమారుడు లేచి చూసే సరికి తండ్రి విగతజీవిగా కనిపించడంతో కేకలు వేశాడు. చుట్టుపక్కల వారంతా వచ్చి తలుపు తీసి చూసే సరికి అతని చనిపోయి ఉన్నాడు. ఈ విషయాన్ని శ్రీకాకుళంలోని అతని చెల్లి సుజాతకు సమాచారం ఇచ్చారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎంవీ స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభం


జ్యోతి వెలిగించి క్లినిక్ ప్రారంభిస్తున్న డాక్టర్ సోమయాజులు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–11లో ఎంవీ స్పెషాలిటీ క్లినిక్ సేవలను గాయత్రి విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ పి.సోమయాజులు ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ క్లినిక్ ద్వారా డాక్టర్ సూర్యతేజ వెన్నెలకంటి, డాక్టర్ అశ్విని మాచిరాజులు నగర వాసులకు విలువైన, ఆధునిక వైద్య సేవలు అందించనున్నారు. డయాబెటిస్, ఊబకాయం, థైరాయిడ్ సమస్యలతో పాటు ఫార్మసీ, లేబొరేటరీ, ఫిజియోథెరపీ, రిహాబ్, తదితర వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా మెడికేటెడ్ చెప్పుల తయారీ సేవలు ఈ క్లినిక్ ద్వారా అందిస్తున్నట్లు డాక్టర్ సూర్యతేజ, డాక్టర్ అశ్విని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నగర వ్యాపారవేత్తలు, వైద్యనిపుణులు పాల్గొని వారికి అభినందనలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో మద్యం దుకాణం దగ్ధం


కాలి బూడిదైన మద్యం బాటిళ్లు

దాబాగార్డెన్స్: షార్ట్ సర్క్యూట్‌తో సూర్యాబాగ్‌లోని ప్రభుత్వ మద్యం దుకాణం కాలి బూడిదైంది. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి సూర్యాబాగ్‌లో ఆదివారం వేకువజామున ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రూ.31,86,090 విలువ గల 10,098 మద్యం బాటిల్స్ కాలిబూడిదయ్యాయని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఆదివారం ఉదయం దుకాణం నుంచి పేలుడు శబ్దాలు వస్తున్నట్లు గమనించిన వాచ్‌మన్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే అక్కడకు వారు చేరుకుని దుకాణం షట్టర్ తెరిచి చూశారు. అప్పటికే దుకాణంలోని అన్ని మద్యం బాటిల్స్ కాలిపోయినట్టు గుర్తించారు.

విశాఖ ఎంపీగా పోటీ చేస్తా..

సీతమ్మధార: వచ్చే ఎన్నికల్లో విశాఖ ఎంపీగా పోటీ చేస్తానని ప్రజాశాంతి అధ్యక్షుడు కె.ఎ.పాల్ ప్రకటించారు. తాను విశాఖ ఎంపీ అయితేనే దేశానికి, రాష్ట్రానికి రక్షణ అని అన్నారు. ఆశీలమెట్టలోని కె.ఎ.పాల్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ప్రధాని మోదీకి తొత్తు అని ఆరోపించారు. జనసేన, బీజేపీ నాయకులు తన పార్టీలో చేరుకున్నట్లు తెలిపారు. నాతో ఫొటోలు తీసుకున్నావారంతా నాకు ఓటు వేస్తే విశాఖ ఎంపీగా ఐదు లక్షల మెజార్టీతో గెలుస్తానని చెప్పారు. అనంతరం మోదీ తొత్తులతో యుద్ధం–మన విశాఖ సిద్ధం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

- 2 BHK Flat, 1010 Sqft, MVV Highway Homes, NH 16, Madhurawada For Sale. Contact: 8826452478. [WB-48037]

PLOT FOR SALE

- GVMC 77 వార్డులో 6 లక్షలకే 111 చ.గ., 150 ప్లాట్స్ గలవు. దగ్గరలో బస్సులు, ఇల్లు అన్ని సౌకర్యాలతో అందుబాటులో EMI కలదు. ఫోన్ : 73864 14017 [V- 796975]

Services

BUSINESS OFFER

- చెరకు రసం మెషిన్ల వ్యాపారం కొరకు 1,50,000/- పెట్టుబడి కావలెను. పెట్టుబడిపై వడ్డీగాని లేక లాభంలో 50–50గా గాని ఇవ్వబడును. ఫోన్ : 95819 83210 [V- 2359]
- Sri Avani Eco-Life Pvt Ltd. తక్కువ పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించండి. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా "బయో డిగ్రేడబుల్" కవర్లను మార్కెటింగ్ చేయుటకు మండలాల వారీగా డీలర్లు కావలెను. ఫోన్: 9493786468, 6301041696. [H-801665]
- కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టెక్‌టవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1261198]

GOLD LOANS

- లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 11574]

Wanted

- NET / XEROX Operator. Part / Full Time. Attractive Salary. Sai Net, Shop No.46, RTC Complex, Dwarakanagar, VSP-16. Ph : 95536 77279, 90009 20204 [V- 2379]
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సాప్ చేయగలరు. 91777 36926. [M-1233774]
- సేల్స్ ప్రమోటర్స్ (స్త్రీ/పు) జీతం : 15వేలు + ఇన్సెంటివ్స్, వయస్సు : 18+ అర్హత : ఇంటర్ + హెల్పర్స్ : (స్త్రీ/పు) కావలెను. జీతం : 10వేలు. వయస్సు : 18+, అర్హత : 10పాస్. సాయి మొబైల్ సెంటర్, దాబాగార్డెన్స్, వైజాగ్. ఫోన్ : 70134 33911 [V-786709]
- మీరు ఉన్న చోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో అధిక ఆదాయం సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్ టైం) 100% ఎటువంటి ఫీజులు ఉండవు. సంప్ర : 97015 05819 [V-797167]
- హైదరాబాదులోని ఆస్తా హోం కేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21-45వయస్సు గల M/F కేర్‌టేకర్స్ కావలెను. జీతం: 16-20వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్స్ కలవు. Cont: 9381848549 [G-1652]
- ప్రముఖ ఎయిర్‌పోర్ట్‌లో పనిచేయుటకు లోడింగ్ సూపర్‌వైజర్స్, హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్స్, డ్రైవర్స్, కార్గో లోడర్స్,కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. జీతం: 25000/- 35000/- రూం+భోజనం ఫ్రీ. ఫోన్ 7093769794. [H-788064]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

PASSPORT MISSING

I, CHEELI JAYRAJ, S/o. Late. Cheeli Jacob Sudhakar, Resident at D.No.71-31-804, Kranthi Nagar, Gandhigram (Post), Visakhapatnam - 530005, (AP). I Have lost my Passport (No.MD707909). On 15-01-2024 The Said Original Passport was lost while I am traveling by Auto from Kranthi Nagar to Malkapuram Market. If any body find please Contact : 91339 36177

- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K. ఫోన్: 9160900024/9640400073. [HA-1168]

తాజా వార్తలకోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

మురళీనగర్, మాధవధార	90101 33346
NAD, కంచరపాలెం	90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	90100 55116
దాబాగార్డెన్స్, జగదాంబ / MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం